# టాప్ 4లో ఏ ఒక్క టీం సేఫ్ కాదు..
## సన్ రైజర్స్ ప్లే ఆఫ్ చేరడం ఖాయమన్న మాజీ క్రికెటర్..

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న వేళ, సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) జట్టుకు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 82 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైన అనంతరం ఎస్‌ఆర్‌హెచ్ ప్లేఆఫ్స్ అవకాశాలపై కైఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాయింట్ల పట్టికలో టాప్ 4లో ఉన్న ఏ జట్టు కూడా ప్రస్తుతం తమ స్థానం ఖరారైందని భావించి 'సేఫ్'గా ఉండలేరని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం సన్‌రైజర్స్ 12 మ్యాచుల్లో 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నప్పటికీ, గుజరాత్ చేతిలో ఘోర పరాజయం వల్ల వారి నెట్ రన్ రేట్ దెబ్బతిందని, ఇది భవిష్యత్తులో ఇబ్బంది కలిగించవచ్చని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అహ్మదాబాద్ వంటి వేర్వేరు పిచ్ పరిస్థితులకు త్వరగా అలవాటు పడటంలో హైదరాబాద్ విఫలమైందని, కేవలం హోమ్ గ్రౌండ్‌పైనే ఆధారపడటం సరికాదని సూచించారు.

ఎస్‌ఆర్‌హెచ్ తమ తదుపరి మ్యాచ్‌లో మే 18న చెన్నై సూపర్ కింగ్స్‌ను వారి సొంత గడ్డపై ఎదుర్కోవాల్సి ఉంది. టాప్ 2లో నిలవాలంటే ఈ మ్యాచ్ గెలవడం ఎంతో కీలకమని, లేనిపక్షంలో ప్లేఆఫ్స్ రేసు మరింత సంక్లిష్టంగా మారుతుందని కైఫ్ విశ్లేషించారు. గుజరాత్ ఇప్పటికే 16 పాయింట్లతో దాదాపు బెర్త్ ఖరారు చేసుకున్నట్లు కనిపిస్తున్నా, మిగిలిన స్థానాల కోసం కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి జట్లు గట్టి పోటీనిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో ఏ చిన్న పొరపాటు చేసినా టాప్ 4 సమీకరణాలు మారిపోయే అవకాశం ఉందని, అందుకే సన్‌రైజర్స్ అజాగ్రత్తగా ఉండకూడదని ఆయన హెచ్చరించారు. ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే ఆఖరి వరకు పోరాడాల్సిందేనని, పట్టికలో ప్రస్తుత స్థానాన్ని చూసి కంగారు పడకుండా, తదుపరి సవాళ్లకు సిద్ధం కావాలని కైఫ్ సూచించారు. ఈ సీజన్‌లో ఏ జట్టు ఏ సమయంలోనైనా పుంజుకునే అవకాశం ఉన్నందున లీగ్ దశ ముగిసే వరకు ఉత్కంఠ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుత టీమ్ ప్రకారం ఫామ్ చూసుకుంటే సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.



# ఫ్రీ ఐపీఎల్ టికెట్లు అంటూ భారీ మోసం.. 600కు పైగా ఫేక్ వెబ్‌సైట్లు గుర్తింపు, తస్మాత్ జాగ్రత్త!

**డిడి9 వార్త:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 కొనసాగుతున్న వేళ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరలేపారు. ఫ్రీ ఐపీఎల్ టికెట్లు, ఉచిత లైవ్ స్ట్రీమింగ్ పేరుతో అభిమానులను లక్ష్యంగా చేసుకుని భారీ ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నట్లు సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌సెక్ వెల్లడించింది. ఈ మోసాల్లో భాగంగా ఇప్పటికే 600కు పైగా ఫేక్ టికెట్ వెబ్‌సైట్లు, 400కు పైగా నకిలీ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు గుర్తించినట్లు ఓ నివేదిక పేర్కొంది. ఈ ఫేక్ వెబ్‌సైట్లు ఐపీఎల్ టికెట్ల విక్రయం అంటూ.. వినియోగదారుల నుంచి భారీగా డబ్బులు దోచుకుంటున్నాయి. మరోవైపు 'ఫ్రీ లైవ్ స్ట్రీమింగ్' పేరుతో ప్రజలను ఆకర్షించి.. వారి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలో ప్రమాదకరమైన మాల్వేర్‌ను సైబర్ నేరగాళ్లు ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ముఖ్యంగా ఈ వెబ్‌సైట్లు చాలా ప్రొఫెషనల్‌గా ఉంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. మ్యాచ్ షెడ్యూల్స్, టీమ్ లోగోలు, ఆన్‌లైన్ పేమెంట్ ఆప్షన్స్, కస్టమర్ రివ్యూలు వంటి ఫీచర్లు ఉండటంతో.. ఫేక్ వెబ్‌సైట్లు అసలైన సైట్లలా కనిపిస్తున్నాయి. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే.. ఈ ఫేక్ లింకులు సోషల్ మీడియా పోస్టులు, టెలిగ్రామ్ ఛానెల్స్, ఫోరమ్స్, యాడ్స్ ద్వారా విస్తృతంగా షేర్ అవుతున్నాయి. కొన్నిసార్లు యూజర్ ఏ డివైస్ వాడుతున్నాడో గుర్తించి దానికి అనుగుణంగా వేరువేరు హానికర పేజీలకు రీడైరెక్ట్ చేస్తున్నట్లు క్లౌడ్‌సెక్ నివేదిక వెల్లడించింది. ప్రత్యేకంగా 'SHub Stealer' అనే ప్రమాదకర మాల్వేర్‌ను ఈ నకిలీ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు ఇన్‌స్టాల్ చేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మాల్వేర్ ఒకసారి డివైస్‌లో ఇన్‌స్టాల్ అయితే.. యూజర్ల పాస్‌వర్డ్స్, బ్రౌజర్ డేటా, మెసేజింగ్ యాప్ సెషన్స్, క్రిప్టో వాలెట్.. వంటి సమాచారంను సైబర్ నేరగాళ్లకు చేరవేస్తుంది. అంతేకాదు డివైస్‌లో ఉన్న ఫైల్స్‌ను కూడా హ్యాకర్లు సులభంగా యాక్సెస్ చేసే ప్రమాదం ఉంది.

ఈ నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ నిపుణులు కీలక సూచనలు చేశారు. ఐపీఎల్ టికెట్లు కొనుగోలు చేయాలంటే అధికారిక టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను మాత్రమే ఉపయోగించాలని సూచిస్తున్నారు. అలాగే ఫ్రీ లైవ్ స్ట్రీమింగ్ అంటూ వచ్చే అనుమానాస్పద వెబ్‌సైట్లను పూర్తిగా దూరంగా ఉంచాలని హెచ్చరిస్తున్నారు. తెలియని ఫైల్స్ డౌన్‌లోడ్ చేయకూడదని, సోషల్ మీడియా లేదా వాట్సాప్‌లో వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదని సూచించారు. ఐపీఎల్ క్రేజ్‌ను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో అభిమానులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.



# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్.. బంగ్లా ఆటగాళ్ల పంట పండింది!

- **పాక్‌పై 104 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ చారిత్రక టెస్ట్ విజయం**
- **కెప్టెన్ నజ్ముల్ షాంటోకు కెరీర్ బెస్ట్ 23వ ర్యాంక్**
- **బ్యాటింగ్‌లో ముష్ఫికర్, మోమినుల్... బౌలింగ్‌లో తైజుల్, నహీద్ రాణా జంప్**
- **వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పట్టికలో పాకిస్థాన్‌ను దాటేసిన బంగ్లా**



**డిడి9 వార్త:**

మిర్‌పూర్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టులో 104 పరుగుల తేడాతో చారిత్రక విజయం సాధించిన బంగ్లాదేశ్, ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో తమ తొలి గెలుపును నమోదు చేసింది. ఈ అద్భుత విజయంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు తాజాగా విడుదలైన ఐసీసీ పురుషుల టెస్ట్ ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో భారీగా లాభపడ్డారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఆటగాళ్లు తమ ర్యాంకులను గణనీయంగా మెరుగుపరుచుకున్నారు.

ఈ మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో, బ్యాటింగ్‌లో అదరగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో తన తొమ్మిదో టెస్ట్ సెంచరీ సాధించిన అతను, రెండో ఇన్నింగ్స్‌లో కీలకమైన 87 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో ఏకంగా 16 స్థానాలు ఎగబాకి, కెరీర్‌లోనే అత్యుత్తమంగా 23వ ర్యాంకుకు చేరుకున్నాడు. మరోవైపు తొలి ఇన్నింగ్స్‌లో 71, రెండో ఇన్నింగ్స్‌లో 22 పరుగులు చేసిన మాజీ కెప్టెన్ ముష్ఫికర్ రహీమ్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని 26వ స్థానానికి చేరాడు. అలాగే 91, 56 పరుగులతో రాణించిన మోమినుల్ హక్ 12 స్థానాలు ఎగబాకి 35వ స్థానంలో నిలిచాడు. అటు బౌలింగ్‌లోనూ బంగ్లా ఆటగాళ్లు సత్తా చాటారు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ రెండేసి వికెట్లు పడగొట్టిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లాం, మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 13వ ర్యాంకుకు చేరుకున్నాడు. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో 92 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన ఫాస్ట్ బౌలర్ నహీద్ రాణా, ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 64వ స్థానంలో నిలిచాడు.

ఈ ఓటమిలోనూ పాకిస్థాన్‌కు కొన్ని సానుకూల అంశాలు చోటుచేసుకున్నాయి. అరంగేట్రం చేసిన అబ్దుల్లా ఫజల్ తొలి ఇన్నింగ్స్‌లోనే సెంచరీతో ఆకట్టుకుని 75వ ర్యాంకులో, రెండు ఇన్నింగ్స్‌లలోనూ హాఫ్ సెంచరీలు సాధించిన అజాన్ అవాయిస్ 82వ ర్యాంకులో నిలిచారు. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసిన సీమ్ బౌలర్ మహమ్మద్ అబ్బాస్, 28వ స్థానంతో తిరిగి ర్యాంకింగ్స్‌లోకి ప్రవేశించాడు. ఈ విజయంతో బంగ్లాదేశ్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ స్టాండింగ్స్‌లో పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టింది.

# 39 ఏళ్ల వయసులో ప్రపంచ రికార్డు.. 130 ఏళ్ల చరిత్రను తిరగరాసిన పాక్ స్పిన్నర్!

- **పాకిస్థాన్ స్పిన్నర్ నోమాన్ అలీ ప్రపంచ రికార్డు**
- **టెస్టుల్లో 100 వికెట్లు తీసిన అత్యంత పెద్ద వయస్కుడిగా ఘనత**
- **39 ఏళ్ల 217 రోజుల వయసులో ఈ మైలురాయిని అందుకున్న నోమాన్**
- **1896 నాటి ఇంగ్లండ్ స్పిన్నర్ రికార్డును అధిగమించిన పాక్ స్పిన్నర్**



**డిడి9 వార్త:**

పాకిస్థాన్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నోమాన్ అలీ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. టెస్టుల్లో 100 వికెట్లు పూర్తి చేసిన అత్యంత పెద్ద వయస్కుడైన క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు. బంగ్లాదేశ్‌తో మీర్‌పూర్‌లో మంగళవారం జరిగిన తొలి టెస్టులో ఆయన ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు.

ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్‌ను ఔట్ చేయడం ద్వారా నోమాన్ అలీ తన 100వ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ మైలురాయిని చేరుకునే సమయానికి ఆయన వయసు 39 సంవత్సరాల 217 రోజులు. దీంతో సుమారు 130 ఏళ్ల నాటి రికార్డు బద్దలైంది. గతంలో ఈ రికార్డు 1896లో ఇంగ్లండ్ స్పిన్నర్ బాబీ పీల్ పేరిట ఉండేది. ఆయన 39 ఏళ్ల 180 రోజుల వయసులో 100 వికెట్ల మార్కును చేరుకున్నాడు.

ఆలస్యంగా 34 ఏళ్ల వయసులో టెస్టుల్లో అరంగేట్రం చేసిన నోమాన్ అలీ, అప్పటి నుంచి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించిన రెండో అత్యంత పెద్ద వయస్కుడిగా కూడా ఆయన పేరిట రికార్డు ఉంది. అయితే, నోమాన్ అలీ వ్యక్తిగతంగా రికార్డు సృష్టించినప్పటికీ ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్‌కు ఓటమి తప్పలేదు. బంగ్లాదేశ్ యువ పేసర్ నహీద్ రాణా అద్భుత బౌలింగ్‌తో చెలరేగడంతో పాకిస్థాన్‌పై ఆ జట్టు 104 పరుగుల తేడాతో చారిత్రక విజయం సాధించింది.

# సీఎస్కే జట్టులోకి మరో విధ్వంసకర బ్యాట్స్‌మెన్.. SRH ప్లే ఆఫ్ ఆశలు గల్లంతేనా..?

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస గాయాలతో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్ (CSK) జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. గాయపడిన యువ ఆల్‌రౌండర్ రామకృష్ణ ఘోష్ స్థానంలో కర్ణాటకకు చెందిన మెక్నీల్ హాడ్లీ నోరోన్హాను జట్టులోకి తీసుకున్నట్లు సమాచారం. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రామకృష్ణ ఘోష్ ఐపీఎల్ అరంగేట్రం చేశారు. అయితే.. అదే మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ కింద పడటంతో అతని కుడి కాలికి తీవ్రమైన ఫ్రాక్చర్ అయ్యింది. దీంతో అతను ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ధృవీకరించిన సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్, నోరోన్హాను జట్టులోకి తీసుకునేందుకు బీసీసీఐ అనుమతి కోరినట్లు తెలిపారు.

**ఎవరీ నోరోన్హా?**

24 ఏళ్ల నోరోన్హా కర్ణాటక దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. గతేడాది జరిగిన మహారాజా ట్రోఫీలో మంగళూరు డ్రాగన్స్ తరపున ఆడిన అతను.. 13 మ్యాచ్‌ల్లో 148.82 స్ట్రైక్ రేట్‌తో 253 పరుగులు చేశాడు. అందులో ఏకంగా 19 సిక్సర్లు బాది తన పవర్ హిట్టింగ్ సత్తా చాటాడు. ఆఫ్ స్పిన్ బౌలింగ్‌తో 10 వికెట్లు పడగొట్టి ఆల్‌రౌండర్‌గా మెరిశాడు. అతని నిలకడైన ఆట తీరుతో కర్ణాటక సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ జట్టులోనూ చోటు దక్కించుకున్నాడు. రామకృష్ణ ఘోష్ దూరం కావడంపై హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ విచారం వ్యక్తం చేశారు. "ఘోష్ చాలా వేగంగా ఎదుగుతున్నాడు. అతను కేవలం బౌలర్ మాత్రమే కాదు, బ్యాటింగ్‌లోనూ మెరుగుపడి మంచి ఆల్‌రౌండర్‌గా తయారవుతున్నాడు. ఈ సమయంలో అతను గాయపడటం జట్టుకు పెద్ద లోటు" అని ఫ్లెమింగ్ పేర్కొన్నారు.



**కష్టాల్లో చెన్నై..**

ఈ సీజన్ చెన్నైకి గాయాల సీజన్‌గా మారింది. ఇప్పటికే ఖలీల్ అహ్మద్, ఆయుష్ మ్హాత్రే వంటి ఆటగాళ్లు గాయపడగా, స్టార్ ప్లేయర్ MS ధోనీ కూడా కాలి కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్నారు. బౌలింగ్ విభాగంలో నాథన్ ఎల్లిస్ అందుబాటులో లేకపోవడం, స్పెన్సర్ జాన్సన్ ఆలస్యంగా చేరడం జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నోరోన్హా రాక చెన్నై జట్టుకు ఎంతవరకు బలాన్నిస్తుందో వేచి చూడాలి.

అయితే ఎంత మంది వచ్చినా.. సన్ రైజర్స్ హైదరాబాద్ మాత్రం ప్లే ఆఫ్స్ కు వెళ్లడం ఖాయం అంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. హైదరాబాద్ జట్టు మే 18న చెన్నైలోనే సీఎస్కేతో తలపడనుంది.

